క్లుప్తంగా

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రం, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకెళ్లారు. స్వామికి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

16న సర్వసభ్య సమావేశం

పద్మనాభం: పద్మనాభం మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 16న మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీవో బి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం కానున్నట్టు ఆమె తెలిపారు.

మందుబాబులకు రూ.27 వేల జరిమానా

పీఎం పాలెం : మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కిన వారికి న్యాయస్థానం రూ.27 వేలు జరిమానా విధించింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం ట్రాఫిక్ ఎస్‌ఐ వెంకటరావు తెలిపిన వివరాల ప్రకారం... ఇటీవల జాతీయ రహదారిపై నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతున్న 11 మందిపై కేసులు నమోదు చేశారు. వారిని కోర్టు ముందు హాజరు పరచగా రూ.2 వేలు నుంచి రూ.4 వేల చొప్పున మొత్తం రూ.27 వేలు జరిమానా న్యాయమూర్తి విధించారని ఎస్‌ఐ తెలిపారు.

న్యాయవాదులకు సమాజంపై అవగాహన అవసరం

పీఎం పాలెం : న్యాయవాద వృత్తిలో రాణించాలంటే సమాజంపై అవగాహన అవసరమని, ఆదర్శ జీవన విధానం అలవరచుకోవాలని నగర దిశ పోలీస్ స్టేషన్ ఏసీపీ వివేకానంద్ సూచించారు. ఆశ్వార్ దాస్ న్యాయ కళాశాలలో న్యాయశాస్త్ర విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ న్యాయవాద వృత్తి అత్యంత గౌరవప్రదమైనదన్నారు. ఈ వృత్తిలో రాణించాలంటే నిరంతరం భారత న్యాయ శాస్త్రాన్ని అభ్యసించడంతోపాటు అంతర్జాతీయ న్యాయ శాస్త్రాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ అండ్ చైర్మన్ డాక్టర్ ఎస్‌పీ రవీంద్ర మాట్లాడుతూ న్యాయశాస్త్ర విలువలు, కోర్టులు, చట్టాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.దీపికా దాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ అలక్ చంద్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా సింహవల్లీ తాయారు తిరువీధి



అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కొలువుదీరిన సింహవల్లీ తాయారు అమ్మవారికి శుక్రవారం తిరువీధి ఘనంగా జరిగింది. అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి పల్లకీలో వేంజేపచేశారు. ఆలయ బేడా మండపంలో తిరువీధి నిర్వహించి హారతి సమర్పించారు. కార్యక్రమాన్ని అర్చకుడు అప్పాజీ, పారాయణదారులు నిర్వహించారు.

ఇళ్లు కూల్చించిన వారికి ఓటేస్తారా..?

- రాజకీయ వ్యాపారుల మాటలు నమ్మొద్దు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



కె.నగరపాలెంలో కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు హారతిస్తున్న మహిళలు

కొమ్మాది: గతంలో ఎమ్మెల్యేగా వున్నప్పుడు మంగమారిపేటలో మత్స్యకారులు నిర్మించుకున్న 130 ఇళ్లను, తిమ్మాపురంలో 75 ఇళ్లను కూల్చి వేయించిన వ్యక్తి మరలా ఇక్కడ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నాడని, అలాంటి వ్యక్తికి ఓటు వేస్తారా అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రశ్నించారు. జీవీఎంసీ 4వ వార్డు పరిధి కె.నగరపాలెం, సోమన్నపాలెం, గొల్లలపాలెంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన వ్యక్తి ఇప్పుడు కూటమి పేరుతో మరలా ప్రజల్లోకి వస్తున్నారని, అలాంటి వారిని నమ్మవద్దన్నారు. అర్హులందరికీ సొంతింటి కల సాకారం చేసిన ఘనత వైఎస్సార్‌సీపీదే అన్నారు. కె.నగరపాలెం రోడ్డు విస్తరించాలని 23 సంవత్సరాల నుంచి ప్రయత్నాలు చేశారని, తాను ఎమ్మెల్యే అయిన తర్వాతే రూ.9 కోట్లతో రోడ్డు విస్తరించానని తెలిపారు. ప్రతి ప్రాంతంలోనూ ఎల్ఈడీ లైట్లు, డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణంతోపాటు ప్రజలకు పూర్తి స్థాయిలో మంచినీటి సౌకర్యం కల్పించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాజకీయాన్ని వ్యాపారంగా చేసే వారి మాటలు నమ్మవద్దని, నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరించే వ్యక్తిని తానని పేర్కొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ప్రచారంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు అడుగడుగునా మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి, నాయకులు సింగన్న, అప్పన్న, ఎరుసు అప్పలకొండ రెడ్డి, కె.రమణ, సన్యాసిరావు, అచ్చారావు, చిన్నారావు, ఈశ్వర్‌రెడ్డి, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

గంటా ప్రజాగ్రహానికి గురికాక తప్పదు



సంతపేటలో సమావేశమైన వైఎస్సార్‌సీపీ యూత్ ప్రతినిధులు

తగరపువలస: 2014 నుంచి 2019 వరకు అవినీతి, భూ కబ్జాలతో భీమిలి ప్రతిష్టను దెబ్బతీసిన గంటా శ్రీనివాసరావు ఈ సారి ఎన్నికల్లో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని వైఎస్సార్‌సీపీ జీవీఎంసీ 2వ వార్డు యూత్ ప్రతినిధులు హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం సంతపేటలో జరిగిన సమావేశంలో వీరు మాట్లాడారు. అయిదేళ్లపాటు నియోజకవర్గ ప్రజలకు కనిపించకుండా వ్యాపారాలు చేసుకున్న గంటా ఇప్పుడు ఎన్నికలు ఉండటం వల్లే తిరిగి వచ్చారన్నారు. అయిదేళ్లపాటు ప్రజల మధ్యే తిరుగుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు భారీ మెజారిటీతో గెలుపొందుతారన్నారు. కోవిడ్ వంటి కష్టకాలంలో కూడా ఆయన భీమిలి ప్రజలను విడిచిపెట్టలేదన్నారు. డబ్బులతో ఓటర్లను, నాయకులను కొనడానికి వస్తున్న గంటా శ్రీనివాసరావుకు ఈ సారి భీమిలి ప్రజల చేతిలో పరాభవం తప్పదన్నారు. కార్యక్రమంలో శిల్లా వంశీరెడ్డి, ఉప్పాడ అప్పలరెడ్డి, చేట్ల కొత్తయ్యరెడ్డి, చేట్ల త్రినాథరెడ్డి, చేట్ల పైడిఎల్ల, బోర వెంకట అప్పారావు, కొసన శ్రీనివాసరెడ్డి, చిల్ల శంకరరెడ్డి, చేట్ల సత్తిరెడ్డి, పీతల రాజారావు, బోర వెంకట అప్పారావు, సురేష్, శంకర్, బొట్ట రమణ, చేట్ల నరసింగరెడ్డి, సరగడ నాగిరెడ్డి, కె.వి.రావు, తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశించిన సమయంలోనే పనులు చేయించాలి



కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న ఎంపీడీవో అప్పలనాయుడు

ఆనందపురం : ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోనే కూలీలతో పనులు చేయించాలని ఎంపీడీవో ఎస్.అప్పలనాయుడు సూచించారు. మండలంలోని మామిడిలోవ చెరువులో చేపట్టిన జాతీయ ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులను ఉదయం త్వరగా ప్రారంభించి 10 గంటలలోపు నిలిపి వేయాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉండడం వల్ల కూలీలు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉన్నందున క్షేత్ర స్థాయి సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పని ప్రాంతంలో టెంట్‌లు ఏర్పాటు చేసి, మంచినీరు, ప్రాథమిక చికిత్సకు అవసరమయ్యే మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సందర్భంగా కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందుల కిట్లు అందజేశారు. కూలీల మస్టర్లను పరిశీలించారు. ఆయనవెంట ఈసీ ఎ.తిరుమలరావు, టీఏ ప్రసాద్ ఉన్నారు.

మెరిసిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు



ఏకేశ్వరి నాయుడమ్మ (951, బైపీసీ)



ఎస్.సాయి కావ్య (964, ఎంపీసీ)

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో విద్యార్థులు 44.44 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక్కడ 117 మంది పరీక్షలకు హాజరవగా 52 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో పద్మనాభం మండలం గెద్దపేటకు చెందిన జి.ఏకేశ్వరి నాయుడమ్మ బైపీసీలో 951 మార్కులు సాధించింది. ఎంపీసీలో భీమిలికి చెందిన ఎస్.కిరణ్మయి 906 మార్కులు సాధించింది. పద్మనాభం మండలం కురపల్లికి చెందిన ఎం.శంకర్ సీఈసీలో 850 మార్కులు సాధించగా భీమిలి మండలం అల్లుపేటకు చెందిన ఎ.వై.అప్పన్న 928 మార్కులు సాధించాడు. ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 158 మందికి 136 మంది (86.06శాతం) ఉత్తీర్ణత సాధించారు. అలాగే కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 31 మందికి 21 మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో సింహాచలంకు చెందిన ఎస్.సాయి కావ్య 964 మార్కులు సాధించింది.

పద్మనాభం కేజీబీవీలో 66 శాతం ఉత్తీర్ణత

పద్మనాభం: పద్మనాభం కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ద్వితీయ ఇంటర్‌లో 66 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు స్పెషలాఫీసర్ గ్రేస్ లిల్లీ తెలిపారు. ద్వితీయ ఇంటర్‌లో 32 మందికి 21 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. వీరిలో సీహెచ్.రమ్య 1000 మార్కులకు 922 సాధించినట్లు తెలిపారు. కంబాల దివ్య 908, గేదెల మానస 905 మార్కులు సాధించినట్టు తెలిపారు. ఏడుగురు విద్యార్థినులు 800 పైన, ఏడుగురు విద్యార్థినులు 700 పైన మార్కులు సాధించినట్టు తెలిపారు. ప్రథమ ఇంటర్ ఎంపీసీలో 30 మందికి 16 మంది విద్యార్థినులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. బోని ధనలక్ష్మి 470 మార్కులకు 412 సాధించినట్టు ఆమె తెలిపారు.



సీహెచ్.రమ్య



బి.ధనలక్ష్మి

కేథరిన్, శ్రీబాసర విద్యార్థుల ప్రతిభ



కాగితాల ధనలక్ష్మి



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీబాసర విద్యాసంస్థల చైర్మన్ పూడి రమేష్

తగరపువలస: ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో భీమిలి కేథరిన్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. గేదెల మోహన సాయి లక్ష్మి ఎంపీసీలో 1000కు 980 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈమెకు ఫస్టియర్, సెకండ్ ఇయర్‌లో గ్రూప్ సబ్జెక్టుల్లో నూటికి నూరుశాతం మార్కులు లభించాయి. ఈ సందర్భంగా ఆమెను శుక్రవారం కేథరిన్ విద్యాసంస్థల చైర్మన్ ఆలీవర్ ఆర్ రాయి, ప్రిన్సిపాల్ కె.కె.నాయుడు అభినందించారు. ఈ కళాశాలలో సీహెచ్.రేవతి 958, జి.రుత్వికసాయి 956, కె.ధనలక్ష్మి 950 మార్కులు సాధించారు. బైపీసీలో రౌతు గుణశ్రీ ప్రవళిక 978 మార్కులు సాధించారు.

శ్రీబాసర విద్యార్థుల సత్తా..

స్థానిక శ్రీబాసర కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థుల్లో ఎంపీసీలో 470 మార్కులకు కె.అలేఖ్య, పి.ఝాన్సీ 465, కె.మోహన్‌కృష్ణ 464, బి.లాస్య 463, కె.దివ్య 432 మార్కులు సాధించారు. 460కు పైగా మార్కులు 9 మంది, బైపీసీలో 430 మార్కులకు పైగా ముగ్గురు విద్యార్థులు సాధించారు. ఫైనలియర్ ఎంపీసీలో ఎం.శ్రీశావణి 988, పి.వెంకటలక్ష్మి 987, బైపీసీలో బి.ఎస్.కె.తేజశ్విని 978, ఎల్.తనోజ్‌కుమార్ 976 మార్కులు సాధించారు. 980కు పైగా మార్కులు 8 మంది విద్యార్థులు సాధించారు. వీరిని శ్రీబాసర విద్యాసంస్థల చైర్మన్ పూడి రమేష్, ప్రిన్సిపాల్ వి.వి.డి.రమేష్, అధ్యాపకులు అభినందించారు.

- భీమిలి మండలం తాటితూరు పంచాయతీ కాగితాలపేటకు చెందిన కాగితాల ధనలక్ష్మి బైపీసీ ఫస్టియర్‌లో 440 మార్కులకు 433 సాధించింది. ఈమెను పలువురు అభినందించారు.

అప్పన్నకు విశేషంగా నిత్య కల్యాణం



యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ప్రత్యేకంగా అలంకరించి వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో అప్పన్న కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలతో కల్యాణ మండపం కిక్కిరిసింది. వారికి కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

ఫ్లిప్‌కార్ట్ గ్రోసరీ ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రం ప్రారంభం

- వెయ్యి మందికి ఉపాధి కల్పన

బీచ్‌రోడ్డు: ఉత్తరాంధ్రతో పాటు కాకినాడ, రాజమండ్రి ప్రాంతాలకు ఒక్క రోజులో కిరాణా సరకులను డెలివరీ చేసేందుకుగాను ఫ్లిప్‌కార్ట్ గ్రోసరీ ఫుల్ ఫిల్‌మెంట్ కేంద్రాన్ని యలమంచిలి మండలం యర్రవరం గ్రామంలో ప్రారంభించినట్టు సంస్థ చీఫ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్ రజనీష్ తెలిపారు. కేంద్రం ప్రారంభోత్సవ వివరాలను మీడియాకు ఆయన తెలిపారు. ఈ కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా రోజుకు 8వేల ఆర్డర్లను డెలివరీ చేయగలుగుతామన్నారు. ఇందులో సుమారు వెయ్యి మందికి ఉపాధి కల్పించనున్నట్టు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తమ మార్కెట్ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఇప్పటికే విజయవాడలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఇది రెండో కేంద్రమని చెప్పారు. ఈ కేంద్రాల ద్వారా నేరుగా ఉపాధి కల్పించడంతో పాటు చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో కూడా ఉపాధి కల్పనకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో హరి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో అందరికీ మేలు



మామిడిలోవలో ప్రచారం చేస్తున్న నాయకులు



లక్ష్మీదేవి పేటలో ప్రచారం చేస్తున్న నాయకులు



ఆనందపురంలో ప్రచారం చేస్తున్న నాయకులు

- ఎమ్మెల్యేగా ముత్తంశెట్టిని, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించండి
- ఇంటింటికీ వైఎస్సార్ సీపీ నాయకుల విస్తృత ప్రచారం

ఆనందపురం : సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకూ మేలు చేసే వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం కోరారు. మండలంలోని మామిడిలోవ, గొట్టిపల్లి, కల్లివానిపాలెం, యాతపేట, ఆనందపురం గ్రామాల్లో శుక్రవారం ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బంక సత్యం మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో రైతు భరోసా, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, చేయూత, ఆసరా, అమ్మ ఒడి, వాహనమిత్ర వంటి పథకాలు వల్ల ఎంతో మంది పేదలకు మేలు జరిగిందని చెప్పారు. టీడీపీ పాలనలో అర్హత చూడకుండా కేవలం పార్టీ కార్యకర్తలకే పథకాలు అందజేసి, నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భీమిలి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావుని, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు.

ప్రచారంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, జేసీఎస్ కన్వీనర్ గండ్రెడ్డి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, సర్పంచ్‌లు చందక లక్ష్మి, షిణగం అప్పలరాజు, నాయకులు బొట్టా రామకృష్ణ, చందక అప్పలస్వామి, షిణగం చిన రామారావు, బలిరెడ్డి మహేష్, డోల ఆనంద్, లెంక రాంబాబు, గండ్రెడ్డి నాగేశ్వరరావు, పడాల రాము, గండ్రెడ్డి గోవింద్, కోరాడ ముసిలినాయుడు, షిణగం రాంబాబు, బొట్ట బంగారునాయుడు, చిన్నారావు, బోయి వెంకటరమణ, ఉప్పాడ సూరిబాబు, ఇల్లిపిల్లి నరిసింగరావు, గుడ్ల రమణ, తెడ్లాపు గోవింద్, మామిడి కిరణ్, ఉప్పాడ రామిరెడ్డి, చందక అప్పలనాయుడు పాల్గొన్నారు.

హుషారుగా వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం

మధురవాడ: వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు జీవీఎంసీ 6, 7 వార్డుల్లో హుషారుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం నాయకులు కాలనీల్లో, నివాస ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బలపరిచిన ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. జీవీఎంసీ 6వ వార్డు ఎంఎస్ఆర్ లే అవుట్ పరిసర ప్రాంతాల్లో వివిధ విభాగాల నాయకులు డాక్టర్ గాదె రోశిరెడ్డి, సియాద్రి కనకరాజు, బి.ప్రసాద్, పోతిన సూరిబాబు, సురేష్, మంగవేణి, శివ, వెంకటేశ్వర్లు, తాతారావు, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 7వ వార్డు పిలకవానిపాలెం, కార్‌షెడ్ కూడలి పరిసర ప్రాంతాల్లో ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. నాయకులు పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిల్లా సూరిబాబు, చేకూరి రజని, వంకాయల మారుతీప్రసాద్, జగ్గపిల్లి నరేష్, పెంద్ర అప్పన్న, పసుపులేటి గోపి, సత్యనారాయణ, పి.గురునాథ్, టి.సుబ్బు, తదితరులు పాల్గొన్నారు.



కల్లివానిపాలెంలో ప్రచారం చేస్తున్న నాయకులు



జీవీఎంసీ 6వ వార్డు ఎంఎస్ఆర్ లే అవుట్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు



పిలకవానిపాలెంలో కరపత్రం అందజేసి ఓటు అడుగుతున్న పోతిన శ్రీనివాసరావు, నాయకులు

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు వెల్లడించారు. విశాఖపట్నం-కొల్లాం(08539) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నంలో ప్రతీ బుధవారం ఉదయం 8.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. ఈ రైలు ఈ నెల 17 నుంచి జూలై 3వ తేదీ వరకు నడుస్తుంది. కొల్లాం-విశాఖపట్నం (08540) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ కొల్లాంలో ప్రతీ గురువారం రాత్రి 7.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 11.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైలు ఈ నెల 18 నుంచి జూలై 4వ తేదీ వరకు నడుస్తుంది.

- భువనేశ్వర్-యల్హంక(02811) స్పెషల్ భువనేశ్వర్‌లో ప్రతీ శనివారం రాత్రి 7.15 గంటలకు బయలుదేరి మరుసటిరోజు తెల్లవారు 1.53 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 1.55 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 11.55 గంటలకు యల్హంక వెళ్తుంది. ఈ రైలు ఈ నెల 13వ తేదీ నుంచి మే 25వ తేదీ వరకు నడుస్తుంది. యల్హంక-భువనేశ్వర్(02812) స్పెషల్ యల్హంకలో ప్రతీ సోమవారం ఉదయం 5 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారు 4.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 4.32 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12.15 గంటలకు భువనేశ్వర్ వెళ్తుంది. ఈ స్పెషల్ రైలు ఈ నెల 15 నుంచి మే 27వ తేదీ వరకు నడుస్తుంది.
- హౌరా-యశ్వంత్‌పూర్(02863) వీక్లీ ఏసీ స్పెషల్ ప్రతీ గురువారం హౌరాలో మధ్యాహ్నం 12.40 గంటలకు బయలుదేరి మరుసటిరోజు తెల్లవారు 2.43 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 2.45గంటలకు బయలుదేరి అదేరోజు మధ్య రాత్రి 12.15 గంటలకు యశ్వంత్‌పూర్ వెళ్తుంది. ఈ స్పెషల్ ఈ నెల 18 నుంచి జూన్ 27వ తేదీ వరకు నడుస్తుంది. యశ్వంత్‌పూర్-హౌరా (02864) వీక్లీ ఏసీ స్పెషల్ ప్రతీ శనివారం యశ్వంత్‌పూర్‌లో తెల్లవారు 5 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 11.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 11.07 గంటలకు బయలుదేరి మరసటి రోజు మధ్యాహ్నం 1.25 గంటలకు హౌరా వెళ్తుంది. ఈ స్పెషల్ ఈ నెల 20 నుంచి జూన్ 29వ తేదీ వరకు నడుస్తుంది.
- కొచ్చువేలి-షాలిమర్(06081) స్పెషల్ ప్రతీ శుక్రవారం సాయంత్రం 4.20 గంటలకు కొచ్చువేలిలో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10.50 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 10.52 గంటలకు బయలుదేరి ప్రతీ ఆదివారం మధ్యాహ్నం 1.40 గంటలకు షాలిమర్ వెళ్తుంది. ఈ రైలు ఈ నెల 12 నుంచి మే 31వ తేదీ వరకు నడుస్తుంది. షాలిమర్-కొచ్చువేలి(06082) స్పెషల్ షాలిమర్‌లో ప్రతీ సోమవారం మధ్యాహ్నం 2.20గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారు 4.18 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 4.20గంటలకు బయలుదేరి ప్రతీ బుధవారం ఉదయం 9.55 గంటలకు కొచ్చువేలి వెళ్తుంది. ఈ రైళ్లు ఈ నెల 15 నుంచి జూన్ 3వ తేదీ వరకు నడుస్తుంది.
- న్యూటిన్‌సుకియా-బెంగళూరు(05952) స్పెషల్ ప్రతీ గురువారం రాత్రి 6.45గంటలకు న్యూటిన్‌సుకియాలో బయలుదేరి మూడవ రోజు మధ్యాహ్నం 1.50 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడి నుంచి 2.10గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9గంటలకు బెంగళూరు వెళ్తుంది. ఈ రైలు మే 2వ తేదీ నుంచి జూన్ 27వ తేదీ వరకు నడుస్తుంది. బెంగళూరు-న్యూటిన్‌సుకియా(05951) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ బెంగళూరులో ప్రతీ సోమవారం మధ్యరాత్రి 12.30 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 9.40 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడి నుంచి 10 గంటలకు బయలుదేరి ప్రతీ బుధవారం మధ్యాహ్నం 1.15గంటలకు న్యూటిన్‌సుకియా చేరుకుంటుంది. ఈ రైలు మే 6 నుంచి జూలై 1వ తేదీ వరకు నడుస్తుంది.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.